## క్లుప్తంగా

### ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి



పుస్తకం విడుదల చేస్తున్న నాయకులు

**పెనుకొండ:** ట్రూ అప్ సర్దుబాటు విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని సీఐటీయూ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం సీపీఎం ప్రచురించిన విద్యుత్ షాకులు అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు హరి, బాబావలి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు, సెకీ ఒప్పందం, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, మహబూబ్బాష, గంగాధర్, వెంకటరాముడు, బావమ్మ, నాగరాజు, నరసింహ, సలీం తదితరులు పాల్గొన్నారు.

### అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా

**పెనుకొండ:** అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా కొనసాగిస్తున్నారు. సిబ్బంది నరేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు ఆపరేటర్లు ఈ డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నట్టు డీఎస్పీ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లోని అటవీ ప్రాంతాలు, కొండ గుట్టలు, గ్రామాలు తదితర ప్రాంతాల్లో నిఘా పెట్టామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గ్యాంబ్లింగ్, బైక్ రేస్‌లు, వ్యభిచారం తదితర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడమే లక్ష్యమన్నారు. ఈ ప్రక్రియ నిరవధికంగాకొనసాగుతుందన్నారు.

### మానవ జీవితం సుఖదుఃఖాల సంగమం



వేడుకలు చేసుకుంటున్న విద్యార్థులు

**పెనుకొండ:** మానవ జీవితం సుఖదుఃఖాల సంగమమని ప్రగతి, గ్లోబల్‌జెన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని పాఠశాలల్లో శనివారం ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రెండు పర్వ దినాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. తెలుగు సంవత్సర ఆరంభమే ఉగాది అని, అదే విధంగా భక్తిభావాలకు, దాన ధర్మాలకు ప్రతీక రంజాన్ అని అన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

### తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**రొళ్ల:** మండలంలోని దొడ్డేరి పంచాయతీ పరిధిలోని దొడ్డేరి, దొడ్డేరి ఇందిరమ్మ కాలనీ, పిల్లిగుండ్లు, పిల్లిగుండ్ల బండ కాలనీ తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని సర్పంచ్ అనిత, వైఎస్సార్‌సీపీ తాలూకా జేసీఎస్ బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర శనివారం తెలిపారు. మూడు రోజులుగా ఆయా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసినట్లు తెలిపారు. పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తున్న వాటర్ స్కీమ్ పథకం బోరుబావుల్లో నీళ్ల సమృద్ధిగా ఉన్న కూడా విద్యుత్ కోతల వల్ల నీళ్లు పట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులు చొరవ తీసుకుని కోతలు లేకుండా సక్రమంగా త్రీఫేస్ విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరారు.

### గంగమ్మదేవికి పూజలు

**హిందూపురం:** పట్టణంలోని సూరప్ప కట్ట వద్ద ఉన్న బోయకొండ గంగమ్మదేవి ఆలయంలో శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అమ్మవారికి విశేష అలంకరణతో పూజలు నిర్వహించారు. మోహన్ స్వామి ఆధ్వర్యంలో రాత్రి శత్రుసంహార ప్రత్యంగిర దేవి హోమం చేపట్టారు.

### పంచాయతీకి రూ.6.24 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

**అమరాపురం:** స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం వారపు సంత, దినసరి మార్కెట్, మటన్ మార్కెట్, వాహనాల దినసరి వేలం పాటను సర్పంచ్ వాగేష్, ఈఓఆర్డీ నాగముని, కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో వారపు సంత రూ.2.15 లక్షలు, దినసరి మార్కెట్ రూ.80 వేలకు అమరాపురం గ్రామానికి చెందిన చిత్రశేఖర్ యాదవ్ దక్కించుకున్నారు. అలాగే మటన్ మార్కెట్‌ను రూ.77 వేలకు పాడి జోగప్ప, వాహనాల దినసరి వసూలు వేలం పాటను మంజునాథ రూ.2.52 లక్షలకు దక్కించుకున్నారు. గ్రామ పంచాయతీకి రూ.6.24 లక్షల ఆదాయం వచ్చినట్లు కార్యదర్శి సుధాకర్ తెలిపారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తుల కల్పవల్లి చౌడేశ్వరీదేవి

- నేడు రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

**లేపాక్షి:** చోళసముద్రం గ్రామంలో వెలిసిన చౌడేశ్వరిదేవి భక్తుల కల్పవల్లిగా విరాజిల్లుతోంది. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పూజలందుకుంటోంది. చౌడేశ్వరిదేవి ఆలయం చోళరాజుల కాలంలో నిర్మించినప్పటికీ విజయనగర కాలంలో అభివృద్ధి చెందింది. ప్రాచీన కాలంలో గ్రామ దేవతల ఆరాధన ఆరుబయలులోనే జరిగేది. ఆ రీతిలోనే మొదట చౌడమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ఆలయం చోళుల కాలంలో చిన్నగుడిగా రూపుదిద్దుకుంది. విజయనగర శిల్ప శైలి అభివృద్ధిగాక మునుపే ఈ ఆలయాన్ని కట్టించారని చెప్ప వచ్చు. ఆలయ ముఖ మడపం పైకప్పులో పద్మం ఆకారంలోని రాళ్లపై వివిధ భంగిమల్లో నాట్య శిల్పాలు, కోలాటం ఆడుతున్న మహిళ బొమ్మలు ఉన్నాయి. గుడి ముందు భాగంలో ఎత్తయిన వేదిక గల నాలుగు స్తంభాల మండపం నుంది. సాధారణంగా శైవ ఆలయాల ముందు ప్రత్యేక మండపాలను నిర్మించి అందులో శివుని వాహనమైన నంది విగ్రహాన్ని ఉంచుతారు. అయితే ఈ మండపం ఖాళీగా ఉంది.

**రాయలపై అమ్మవారి కృప..**

శ్రీకృష్ణదేవరాయల సువిశాల సామ్రాజ్యాన్ని పరిపాలించడానికి వారసుడు కావాలని ఆయన కలలు కన్నాడు. రాయలు తన ఆరాధ్య దైవం వెంకటేశ్వరస్వామిని వేడుకున్నారు. ఇక పట్టపురాణి తిరుమలదేవి పుత్రుని కోసం ఎన్నో పూజలు, నోములు, వ్రతాలు చేసిందని కథనం. అయినా రాయల భార్యలు చిన్నమదేవి, తిరుమలదేవిలకు తొలి సంతానంగా కుమార్తెలు పుట్టారు. దీంతో తిరుమలదేవి చౌడమ్మ తల్లిని ఎంతగానో ఆరాధించింది. రాయల మంత్రి, సన్నిహితుడు తిమ్మరుసును పంపి చౌడమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించింది. పూజలు చేసిన ఏడునెలలకే కుమారుడు జన్మించాడని శాసనం ద్వారా తెలుస్తోంది.

**చౌడేశ్వరిదేవి విశిష్టత**

చౌడేశ్వరిదేవి విగ్రహాన్ని గచ్చుతో తయారు చేసి రంగులు వేశారు. విగ్రహం సుమారు 8 అడుగుల ఎత్తుండి ఒక పీఠంపై కూర్చొన్నట్టు తీర్చిదిద్దారు. అమ్మవారు నాలుగు చేతులతో రౌద్రంగా కనిపిస్తోంది. కుడి చేతుల్లో త్రిశూలం, పొడవాటి కత్తి ఉండగా ఎడుమ చేతుల్లో ఢమరుకం, కుంకుమ భరిణిలు ఉన్నాయి. కుడికాలితో రాక్షసులను తొక్కిపట్టిన కోరలు, సాక్షాత్తు పార్వతీదేవి చౌడేశ్వరిమాతగా పూజలు అందుకుంటోందని భక్తుల నమ్మకం. అమ్మవారికి ప్రతి అమవాస్య, పౌర్ణమి రోజులతో పాటు ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు..



చోళసముద్రంలో కొలువైన చౌడేశ్వరిదేవి

**నేడు బ్రహ్మరథోత్సవం**

ఉగాది సందర్భంగా ఆదివారం చౌడేశ్వరిదేవి అమ్మవారికి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి అమ్మవారిని ప్రత్యేక పూలపల్లకీలో గ్రామవీధుల్లో కీలుగుర్రాలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపు ఉంటుందన్నారు.అన్నదానంతోపాటు ప్రత్యేక పూజలు జరుగుతాయని వారు పేర్కొన్నారు.



ఆలయ ముఖ మండపం



రథోత్సవానికి సిద్ధమవుతున్న తేరు



**ఉష్ణోగ్రత సమాచారం**

| | |
|---|---|
| హిందుపురం | 38.0 |
| పెనుకొండ | 41.0 |
| మడకశిర | 38.0 |

### ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడిగా జబీవుల్లా

**మడకశిర:** పట్టణ ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడిగా జబీవుల్లా నియమితులయ్యారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముస్లింల సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జబీవుల్లాకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

**మిథున్ రెడ్డికి కృతజ్ఞతలు**

పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడిన ఎంపీ మిథున్‌రెడ్డికి మడకశిర నియోజకవర్గ ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు వసీంబేగ్ శనివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లును మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు ముస్లింలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లును అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

### ఎస్పీతో మడకశిర సీఐ భేటీ

**మడకశిర:** మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగేశ్ శనివారం పుట్టపర్తిలో ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించినట్లు తెలిపారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారని పేర్కొన్నారు.

# చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శైలజ



మాట్లాడుతున్న డీటీ మారుతి ప్రకాష్

**లేపాక్షి:** చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని హిందూపురం అదనపు జిల్లా జడ్జి శైలజ తెలిపారు. శనివారం సాయంత్రం కుర్లపల్లి, శిరివరం గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతు పిల్లల రక్షణ చట్టం-2012, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏజీపీ శ్రీనివాస రెడ్డి, న్యాయవాదులు కళావతి, ఫణిభూషణ, మురళీ, రవిచంద్ర, ఈశ్వర్, ఏయస్ఐ షర్ఫుద్దీన్, ఏపీఎం జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

**మడకశిరరూరల్:** గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కలిసి మెలసి జీవించి కుటుంబాలను మరింతగా ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని, తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. శనివారం బుళ్లసముద్రం గ్రామంలో పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

**ఘనంగా పౌర హక్కుల దినోత్సవం**

**అమరాపురం:** మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని డీటీ మారుతి ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా మెలగాలన్నారు. కులమతాలకు అతీతంగా కలసి మెలసి జీవనం సాగించాలని సూచించారు. హక్కులను ఏవిధంగా అనుభవిస్తున్నామో విధులను కూడా మరవద్దన్నారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి ఉండరాదని తెలిపారు. పిల్లల్ని బాగా చదివించాలని సూచించారు. అంటరానితనం ఉండకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మనోహర్ శర్మ పాల్గొన్నారు.

### వలస కార్మికుల వేతనాల చెల్లింపు

**హిందూపురం:** తూమకుంట పారిశ్రామిక వాడలోని ఓస్వాల్ స్టీలు పరిశ్రమలో పని చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులకు శనివారం పరిశ్రమ యాజమాన్యం వేతనాలు చెల్లించింది. వలస కార్మికులకు కాంట్రాక్టర్ రూ.7,26,617 చెల్లించకపోవడంతో పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్ కార్మిక అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డిప్యూటీ లేబర్ కమిషనర్ ఆదేశాల మేరకు పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు వేతనాలు అందజేశారు. ఈసందర్భంగా కార్మికులు డిప్యూటీ లేబర్ కమిషనర్, రవికుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

### సర్వకళాక్షేత్రాన్ని నిర్మించాలని వినతి

**హిందూపురం టౌన్:** పట్టణంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పార్కులో ఆయన పేరు మీదుగా సర్వకళాక్షేత్రాన్ని నిర్మించాలని హిందూపురం తెలుగు భాషాభిమానులు, కళాభిమానులు, కళాకారులు, కవులు, రచయితలు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురంలో ఏదైనా సాహితీ, సాంస్కృతిక, కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసుకోవడానికి ఒక వేదిక లేదన్నారు. పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పార్కులో ఆయన పేరు మీదుగానే స్వర కళాక్షేత్రం పేరుతో ఒక ప్రదర్శనశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

# కోర్టు ఉత్తర్వులు అమలు పరచండి

**సోమందేపల్లి:** జూలకుంట ఆంజనేయస్వామి ఆలయ స్థలంలో ఎలాంటి కట్టడాలు చేపట్టవద్దని హై కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అధికారులు అమలు చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ నారాయణప్ప కోరారు. కూటమి నాయకులు దౌర్జన్యంగా ఆలయ భూమిలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని, పనులు ఆపాలని పోలీస్ స్టేషన్‌తోపాటు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబరు 73లోని ఆలయ భూమి 2014లో అన్యాక్రాంతం కాగా కోర్టును అప్పట్లో ఆశ్రయించగా స్టే ఆర్డర్ వచ్చినట్లు ఆయన తెలిపారు. అయితే శనివారం రోడ్డు పనులు చేపట్టగా డయల్ 100కు కమిటీసభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని కమిటీ సభ్యులను స్టేషన్‌కు తరలించారు. కాంట్రాక్టర్లు యధాతథంగా పనులు చేపట్టడంతో కొద్ది సేపు గ్రామంలో వాగ్వాదం జరిగింది. అధికారులపై కోర్టు ధిక్కరణ కింద కోర్టును ఆశ్రయిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# అక్రమాలు జరుగుతుంటే చోద్యం చూస్తారా?

- చైర్మన్, కమిషనర్‌ను నిలదీసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

**చిలమత్తూరు:** మున్సిపాలిటీలో అక్రమాలు జరుగుతున్నా చోద్యం చూస్తున్నార అంటూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చైర్మన్, కమిషనర్‌పై మండిపడ్డారు. శనివారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రమేష్ అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం పాటకు సంబంధించి కౌన్సిల్ ఆమోదం కోసం ప్రతిపాదన చేయగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతూ పలు అంశాలపై నిలదీశారు. గత ప్రభుత్వం ఏదీ జరగకపోయినా అవినీతి జరిగిందని గగ్గోలు పెట్టిన కూటమి నేతలు ఇప్పుడు ఏకంగా అందరికీ తెలిసేలా అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ అసిఫుల్లా మాట్లాడుతూ గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పట్టణానికి నీళ్లు తెచ్చేందుకు 2017లో రూ.194 కోట్లతో పనులు చేపట్టగా ఇందులో మున్సిపాలిటీ వాటాగా రూ.120 కోట్లకు రూ.60 లక్షల చొప్పున ఈఎంఐ చెల్లిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సొంత బావ సీఎంగా ఉన్నా ఎందుకు మొత్తం బకాయి అంతా ప్రభుత్వం తీర్చే ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. గతంలో అప్పటి సీఎం వైఎస్సార్ 180 కి.మీ వరకూ పైప్‌లైన్ చేయించి పురం ప్రజల దాహార్తి తీర్చారని గుర్తు చేశారు. ఇప్పుడు రూ.కోట్లు ఖర్చు చేసి పెనుకొండ నుంచి నీటిని సక్రమంగా తేవడం లేదని మండిపడ్డారు.



కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

**మున్సిపల్ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోండి**

కొట్నూరు వద్ద మున్సిపాలిటీ స్థలాన్ని టీడీపీ నేతలు ఆక్రమించి షెడ్ నిర్మిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ కౌన్సిలర్ శివ ప్రశ్నించారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. సుంకం వసూళ్లకు సంబంధించి నిర్వహించిన వేలం పాటలో గతంలో బకాయి ఉన్న వ్యక్తుల బంధువులకే మళ్లీ వేలంలో ఎందుకు ప్రాధాన్యత కల్పించారని కౌన్సిలర్ నాగేంద్రబాబు ప్రశ్నించారు. కమిషనర్ బదులిస్తూ చెక్కులు తీసుకున్నామని, ఈ నెలాఖరులోగా చెల్లించకపోతే బ్యాంక్‌లో వేస్తామని సమాధానమిచ్చారు. నగదు కట్టించుకోవాల్సిన చోట చెక్కుల ఆధారంగా వేలం పాటదారుడికి హక్కులు కల్పించడం ఎక్కడా చూడలేదని నిలదీయగా కమిషనర్ నుంచి సమాధానం కరువైంది. పారిశుధ్యం, తాగునీటి సమస్యను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# చేతి వృత్తిదారులను ప్రోత్సహించాలి

**పరిగి:** గ్రామీణ ప్రాంతాల్లో చేతి వృత్తులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న సంప్రదాయ పరిశ్రమలను కాపాడాలని సేవామందిరం సంస్థ అధ్యక్షుడు కేటీ శ్రీధర్ తెలిపారు. శనివారం మండలంలోని సేవామందిరంలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ చైర్మన్(కేవీఐసీ) ఆధ్వర్యంలో గ్రామోద్యోగ వికాస్ యోజన పథకం ద్వారా శిక్షణ పొందిన వారికి టూల్ కిట్లను అందించారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ చైర్మన్ ముంబై నుంచి వర్చ్యువల్ విధానంలో పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేవీఐసీ రాష్ట్ర సహాయ సంచాలకుడు డాక్టర్ ఎస్ గ్రీప్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో పరిగి మండలంలో 200 ఎలక్ట్రిక్ కుండల తయారీ చక్రాలు, 20 మందికి 4 పేపర్ ప్లేట్ల తయారీ యంత్రాలు, 20 ఎలక్ట్రిక్ టూల్ కిట్లు, 20 ఏసీ రిపేరీ టూల్ కిట్లు, 20 కుట్టు మిషన్లు, 100 చింతపండు ప్రాసెసింగ్ టూల్ కిట్లును అందించారు. కార్యక్రమంలో జిల్లా ఎల్‌డీఎం రామారావు, నాబార్డు డీడీఎం అనూరాధ, పంచాయతీ కార్యదర్శి అరుణ, కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ఎల్ మూర్తి, రూడ్‌సెడ్ డైరెక్టర్ విజయలక్ష్మి, సేవామందిరం సంస్థ కార్యదర్శి కేటీ సరిత తదితరులు పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ టూల్ కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

### శిక్షణ ప్రారంభం

**హిందూపురం టౌన్:** స్థానిక ముక్కడిపేటలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ శిక్షణ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన అసిస్టెంట్ సర్వే శిక్షణ కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్ ప్రారంభించారు. కౌన్సిలర్లు ఇర్షాద్, సతీష్, నాక్ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ ఆనంద్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 'భవనాలు నిర్మించండి'

**పెనుకొండ:** పట్టణంలో నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని జైభీం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగరాజు మంత్రి సవితను కోరారు. ఈ మేరకు మంత్రికి శనివారం ఆయన వినతి పత్రం అందించారు. గత ప్రభుత్వంలో 30 వేల జనాభాకు ఒక పీహెచ్‌సీ మంజూరు చేశారని వైద్యులు, మందులు అందుబాటులో ఉన్నా భవనాలు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం సూచించిన స్థలంలో నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. అదే విధంగా పీహెచ్‌సీలకు తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

### ఆనంద నిలయ మండపం ఏర్పాటు

**హిందూపురం:** పట్టణంలోని ప్రసిద్ధ పేట వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం స్వామికి ఆనంద నిలయ మండపం ఏర్పాటు చేశారు. ఉగాది సందర్భంగా ఆలయంలో ఏళ్లనాటి మండపాన్ని ప్రత్యేకంగా మరమ్మతులు చేసి బంగారు వర్ణం పూత చేయించి సిద్ధం చేశారు. ఈసందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి విశేషంగా స్వర్ణపూత మండపంలో పేట వెంకటరమణ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన సదుపాయం కల్పించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు.



ఆనంద మండపంలో కొలువైన వేంకటరమణుడు

# ఆహార పదార్థాల అమ్మకాలకు అనుమతివ్వండి

**పావగడ:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 22,536 చౌక ధాన్యపు డిపోల్లో వంట నూనె, పంచదార, కంది బేడలు, ఉప్పు, తదితర ఆహార పదార్థాలను అమ్మడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని రాజ్య చౌక ధాన్యపు డిపోల సంఘం అధ్యక్షుడు కృష్ణప్ప డిమాండ్ చేశారు. శనివారం అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విధంగా అమ్మకాలు సాగిస్తే గ్రామీణ ప్రజలకు మేలు జరగడమే కాకుండా ఈ పదార్థాల సంచులపై సీఎం, పౌర సరఫరాల శాఖ మంత్రి భావ చిత్రాలు ఉంటాయన్నారు. ప్రభుత్వం సాధనలు ప్రచారం చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆయన స్థానిక తాలూకా కార్యాలయంలోని ఆహార శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. అధికారిణి శశికళతో చర్చించారు. తాలూకా చౌక ధాన్యపు డిపోల సంఘం అధ్యక్షుడు కేటీహళ్లి నాగరాజు, ఉపాధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న చౌక ధాన్యపు డిపోల నిర్వాహకులు

## సంక్షిప్త సమాచారం

**మున్సిపాలిటీకి రూ.10.20 లక్షల ఆదాయం**

**మడకశిర:** మున్సిపాలిటీకి సుంకాల వసూలు వేలం ద్వారా రూ.10.20 లక్షల ఆదాయం సమకూరినట్లు కమిషనర్ రంగస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దినసరి మార్కెట్ వేలం ద్వారా రూ.3.50 లక్షలు, వారపు సంత వేలం ద్వారా రూ.3.20 లక్షలు, బస్టాండ్ల ద్వారా రూ.3.50 లక్షల చొప్పున మొత్తం రూ.10.20 లక్షల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

**రంజాన్ తోఫా పంపిణీ**

**పెనుకొండ:** పట్టణంలోని మంత్రి సవిత కార్యాలయం వద్ద శనివారం ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. ముస్లింలు రంజాన్‌ను భక్తి శ్రద్ధల మధ్య జరుపుకుని అల్లా కృపకు పాత్రులు కావాలన్నారు.

**పేకాటరాయుళ్ల అరెస్ట్**

**పెనుకొండ రూరల్:** దుద్దేబండ గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని కియా పోలీస్‌లు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,340 నగదు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

**వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలి**

**మడకశిర:** పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును టీడీపీ ఎంపీలు వ్యతిరేకించేలా చూడాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజును ముస్లిం ఐక్య వేదిక సభ్యులు కోరారు. శనివారం రాత్రి కొత్త మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు.

**ముందు జాగ్రత్తలతో వ్యాధులు దూరం**

**హిందూపురం టౌన్:** ముందు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులను నివారించుకోవచ్చని వైద్యులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రైల్వే హెల్త్ యూనిట్‌లో రైల్వే ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు వైద్యశిబిరం నిర్వహించారు. బెంగళూరులోని డివిజనల్ రైల్వే ఆస్పత్రి డాక్టర్లు ప్రభావతి, నగేష్ మూర్తి, విశ్వనాథ్, ప్రియదర్శిని, కృష్ణమూర్తి, మేఘ, స్థానిక మెడికల్ ఆఫీసర్ ప్రతిమ ఉద్యోగులకు వివిధ పరీక్షలు నిర్వహించారు.

**కొవ్వొత్తుల ర్యాలీ**

**మడకశిర:** పట్టణంలో శనివారం రాత్రి క్రైస్తవులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ క్రైస్తవ మత బోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం తెలిపారు.

**ఘనంగా బన్నిరాయ జయంతి**

**పావగడ:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం అగ్ని వంశ క్షత్రియ తిగళ సామాజిక వర్గాల ఆరాధ్య దైవం అగ్ని బన్నిరాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బన్నిరాయ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**

**మడకశిర:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో సమానంగా ఎదగాలని ఆకాంక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం అటవీశాఖ ఆధ్వర్యంలో నష్ట పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. పట్టణంలోని కొత్త మసీదులో జరిగిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు.